



ఐద్వా మహాసభలో మాట్లాడుతున్న పి.నిర్మల

మోడీ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- 16న శ్రీశైలం, కర్నూలుకు మోడీ
- డ్రోన్ సిటీకి శంకుస్థాపన, జిఎస్‌టిపై భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. శ్రీశైలంతో పాటు కర్నూలు నగరంలో ఆయన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటన ప్రాథమికంగా ఖరారైంది. తొలుత శ్రీశైలంలో మల్లికార్జునుడిని దర్శించుకోనున్నారు. అక్కడి నుంచి కర్నూలు చేరుకుని ఓర్వకల్లు సమీపంలో డ్రోన్ సిటీకి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నన్నూరు రాగమయూరి వెంచర్ సమీపంలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ అంశంపై నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించనున్నారు. అలాగే ఓర్వకల్లు సమీపంలోని జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించింది. కర్నూలు జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రధాని పర్యటనకు ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఎఎస్ జి.వీరపాండ్యన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌తో కలిసి అధికారులతో ఆయన సమీక్షించారు. అంతకు ముందు స్థల పరిశీలన చేసి వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేసే అంశంపై అధికారులతో చర్చించి, తగు సూచనలు చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్ అండ్ బి శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, పరిశ్రమల శాఖ టీజీ భరత్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బహిరంగ సభలో 3 లక్షల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పాటు పక్క జిల్లాల నుండి కూడా ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే జనాలకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిఎస్‌టి సంస్కరణలు, అభివృద్ధి గురించి సమావేశంలో ప్రధాన మంత్రి వివరించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో విఐపిలు వచ్చే అవకాశం ఉండటంతో ఎస్‌పి విక్రాంత్ పాటిల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

దాదాపు 6 వేల మంది పోలీస్, భద్రత సిబ్బంది జిల్లాకు రానున్నారు. ఈ నెల 13న వారు రిపోర్ట్ చేయనున్నారు. 14న ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. తొలుత కర్నూలు నగరంలో సి క్యాంప్ సెంటర్ నుంచి నంద్యాల చెక్‌పోస్ట్ వరకూ ప్రధాని రోడ్ షో నిర్వహిస్తారని ప్రకటించారు. అయితే భద్రత దృష్ట్యా రోడ్ షో రద్దయ్యే అవకాశం కనిపిస్తోంది.

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీర పాండియన్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి జిల్లాలో ఈనెల 16న జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఎఎస్ అధికారి వీర పాండియన్ ఆదేశించారు. మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, విధులు కేటాయించిన అధికారులతో స్పెషల్ ఆఫీసర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను చేపట్టేందుకు రాష్ట్ర స్థాయి ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ప్రధాని పర్యటన ఏర్పాట్లకు సంబంధించి విధులు కేటాయించిన అధికారులతో మాట్లాడారు. పార్కింగ్‌కు సంబంధించి 11 ప్రదేశాలు ఏర్పాటు చేశామని, ఇందుకోసం వివిధ శాఖల అధికారులను ఇన్చార్జిలుగా నియమించామని, వివిధ జిల్లాల నుండి తెప్పించిన జెసిబిలతో ఈ ప్రాంతాల్లో త్వరితగతిన లెవెలింగ్, బుష్ క్లియరెన్స్ వంటి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివిఐపిలకు, విఐపిలకు గ్రీన్‌రూమ్ ఏర్పాట్లను చూడాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. పబ్లిక్ మీటింగ్ దగ్గర చేయాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదోని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి తదితర విఐపిలకు కాన్వాయ్ వాహనాల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిటిసికి సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, హౌసింగ్ పీడీ చిరంజీవి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఓ శాంతి కళ, డిఆర్డీఏ పిడి రమణారెడ్డి, డిపిఒ భాస్కర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, డిటిసి శాంతకుమారి, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ వీర పాండియన్

ఐక్య ఉద్యమాలకు సిద్ధమవ్వాలి

- ఐద్వా సీనియర్ నాయకురాలు పి.నిర్మల
- కార్మిక కర్షక భవన్‌లో ఐద్వా జిల్లా 12వ మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారం కోసం మహిళలు ఐక్య ఉద్యమాలకు సిద్ధమవ్వాలని ఐద్వా సీనియర్ నాయకురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా 12వ మహాసభలు మంగళవారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో ప్రారంభమయ్యాయి. మహాసభ ప్రారంభానికి ముందుగా పి.నిర్మల జెండావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సభకు అరుణ, ధనలక్ష్మి, రషీదా అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముందుగా అరుణ గత మూడు సంవత్సరాలుగా అమరులైన నాయకులకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. అనంతరం సభను ఉద్దేశించి పి.నిర్మల మాట్లాడారు. ఈనెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. కేంద్రం లోని మోడీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తూ మహిళలను వంటింటికే పరిమితం చేయాలని చూస్తుందని అన్నారు. మహిళల కోసం చట్టాలు చేసినా అమలు కావడం లేదని తెలిపారు. రాష్ట్రంలో మద్యం, మాదక ద్రవ్యాలు, సినిమాలు, టీవీలు, స్మార్ట్‌ఫోన్లలో నీలి చిత్రాల వల్ల యువత పెడదోవ పడుతోందన్నారు. వీటి కారణంగా మహిళలపై దాడులు, హింస, హత్యలు, మాన భంగాలు అధికమవుతున్నాయని చెప్పారు. మహిళలకు విద్య, వైద్యం ఉచితంగా అందించా లన్నారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని పోరాట లకు సిద్ధం కావాలన్నారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు మాట్లాడుతూ ఉపాధి పనులు గ్రామాల్లో, పట్టణాల్లో కల్పించాలని చెప్పారు. జిల్లాలో డ్వాక్రా మహిళలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. మహిళలకు ఇచ్చే పొదుపు లోన్‌లలో దోపిడీ జరుగుతుందని, నివారించా లన్నారు. మహిళలకు ఉపాధి శిక్షణ ఇచ్చి, సబ్సిడీ రుణాలు అందజేసి డ్వాక్రా బజార్లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మహిళలకు పని చేసే ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని అన్నారు. భర్తల నుండి విడిపోయిన, భర్తలు చనిపోయిన ఒంటరి మహిళలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం గత మూడు సంవత్సరాలుగా నిర్వహించిన పోరాటాల నివేదిక ప్రవేశపెట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణం మహిళలకు చేస్తున్నప్పటికీ రకరకాలుగా మనపై అధిక భారాలు వేస్తున్నా రన్నారు. సిఐటియు మహిళలకు అండగా నిలబడుతుం దన్నారు. అనంతరం ప్రజానాట్య మండలి కళాకారులు మహిళా చైతన్యాన్ని గురించి ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకురాలు ఈఎల్ఎస్.రత్నమ్మ, ఉమాదేవి, పిఎస్ సుజాత, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మహిళలు పాల్గొన్నారు.



మహాసభలో పాల్గొన్న మహిళలు

సిజెఐపై దాడి హేయమైన చర్య

- కెవిపిఎస్, సిఐటియు - దాడిని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై దాడి 'హేయమైన చర్య' అని కెవిపిఎస్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండి ఆనంద్ బాబు, ఎండి అంజిబాబు పేర్కొన్నారు. సిజెఐ బిఆర్ గవాయ్‌పై అమానుషమైన దాడికి నిరసనగా మంగళవారం కెవిపిఎస్, సిఐటియు జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కెవిపిఎస్ నగర కార్యదర్శి ఎం.భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సిజెఐపై జరిగిన దాడి దళితులు ఏ స్థాయిలో ఉన్నా దాడులు, దౌర్జన్యాలు చేస్తామన్న దానికి సంకేతమని విమర్శించారు. నాటికి 70 శాతంగా ఉన్న దళిత గిరిజన బడుగు బలహీన వర్గాలు, మైనారిటీలు, మహిళలు ఐక్యంగా ఇలాంటి ఉన్మాదపు చేష్టలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఓల్డ్ సిటీ, న్యూ సిటీ కార్యదర్శులు ఎం విజయ్, ఆర్ నరసింహులు, అధ్యక్షులు వై.నగేష్, అబ్దుల్ దేశాయ్, కెవిపిఎస్ న్యూ సిటీ, ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఏసురాజు, రమణ, నాయకులు సుధాకరప్ప, సాయిబాబా, ప్రభాకర్, రామాంజనేయులు, కుమార్, హుస్సేనయ్య పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

సిజెపై సనాతన ధర్మం పేరుతో షూ విసరడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షుడు హుస్సేన్ భాష అధ్యక్షతన నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్బుల్లా మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అంజి, నగర నాయకులు ఆర్యన్, సాయి, యువరాజ్, సందీప్, ప్రదీప్, విజయ్, న్యాయ విద్యార్థులు దివాకర్, ప్రశాంత్, శ్రీహరి, నిరంజన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్, సిఐటియు నాయకులు



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

పని గంటల పెంపు ఉపసంహరించుకోవాలి

- రైతు, కార్మిక సంఘాల నేతల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ డిమాండ్ చేశారు. పని గంటల పెంపును నిరసిస్తూ, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ధర్నాకు సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళనకు భయపడి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నించలేదన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వాల చేత అమలు చేయించడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నప్పటికీ కేరళ లాంటి ప్రభుత్వాలు కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అమలు చేయడం లేదని తెలిపారు. తమిళనాడులో కూడా కార్మిక వర్గంలో వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆ ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకొని లేబర్ కోడ్స్‌ను అమలు చేయడం లేద న్నారు. మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలులో భాగంగా 8 గంటల పని విధానాన్ని 12, 13 గంటలకు, రాత్రి షిఫ్టులలో మహిళలను పని చేయించడానికి అవసరమైన చట్ట సవరణను చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఓల్డ్ సిటీ అబ్దుల్ దేశాయ్, న్యూ సిటీ కోశాధికారి సాయిబాబా, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సుధాకరప్ప, నగర నాయకులు ఏసు, సిఐటియు నగర అధ్యక్షులు నగేష్, ఆటో వర్కర్స్ యూనియన్ ఓల్డ్ సిటీ కార్యదర్శి మెహమూద్, న్యూ సిటీ అధ్యక్షులు వలి, సిఐటియు కర్నూలు, కల్లూరు మండల కార్యదర్శులు హుసేనయ్య, మధు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఎమ్మెల్యే శ్యాంకుమార్

ప్రజాశక్తి - పత్తికొండ



పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాం కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహారం పోషణలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నారుల మానసిక ఆరోగ్య పెరుగుదలకు పోషకాహార ఆవశ్యకతపై గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పించారు. అందుబాటు ధరల్లో దొరికే జామ, మునగ, ఆకు కూరలు, కాయకూరలు వంటి పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు విరివిగా తీసుకొని,ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని గర్భిణీ, బాలింతలకు వివరించారు. పుట్టిన వెంటనే చిన్నారుల వ్యాధి నిరోధకశక్తికి తల్లి పాలు దోహదపడతాయని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసిన పోషక విలువలతో కూడిన పిండి వంటలను పరిశీలించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో మొక్కలు నాటారు. టిడిపి నాయకులు సాంబశివ రెడ్డి, పీడీ విజయ్, సిడిపిఒ లలిత పాల్గొన్నారు.

టమోటా రైతులకు ఊరట..!

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో టమోటా ధరలు రైతులకు ఊరట కలిగిస్తున్నాయి. మంగళవారం కిలో టమోటా గరిష్టం ధర 20, మధ్యస్థం రూ.18, కనిష్ట ధర రూ.12 పలికినట్లు పత్తికొండ మార్కెట్ కార్యదర్శి పద్మావతి తెలిపారు. 48 టన్నుల టమోటా మార్కెట్‌కు వచ్చిందని చెప్పారు. టమోటా ధర పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నాణ్యత టమోటాకు మంచి ధర లభిస్తుందని చెప్పారు. గిట్టుబాటు ధర లభించకపోతే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

'ఆశాల సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల అధ్యక్షులు షాజహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా వర్కర్లు నిరసన చేపట్టారు. షాజహాన్ మాట్లాడుతూ... ఆశా వర్కర్లపై పని భారం రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించడమే కాకుండా సెలవులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కాంతమ్మ, సరోజా, పిహెచ్‌సి కార్యదర్శి సుశీల, పార్వతి, సుజాత పాల్గొన్నారు.

వీరపాండ్యన్ కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



రాష్ట్ర ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో వీరపాండ్యన్ నాయకత్వం, నిరంతర కృషి ప్రశంసనీయమని మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీరపాండ్యన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో ఆయన అందించిన విలువైన మార్గదర్శకత్వం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీలో చేరుస్తాం : మంత్రి సవిత

- ఘనంగా వాల్మీకి జయంతి రాష్ట్రస్థాయి వేడుకలు



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత

వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం పావలా వడ్డీకే విద్యా రుణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. మహర్షి వాల్మీకి జయంతి రాష్ట్రస్థాయి వేడుకలను మంగళవారం కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, అంబికా, లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, పార్థసారథి, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తదితరులు పాల్గొన్నారు.

(వార్త మెయిన్ పేజీలో...)

సిజెఐపై దాడి అనాగరిక చర్య

- సీనియర్ న్యాయవాది జయరాజు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సిజెఐ బిఆర్.గవాయ్‌పై దాడి అనాగరికమని సీనియర్ న్యాయవాది వై.జయరాజు తెలిపారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. న్యాయవాది అనే ముసుగులో ఒక మత దురహంకారి చేసిన దూషణీయమైన, అనాగరిక చర్యను కర్నూలు నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఖండిస్తుందని తెలిపారు.

సిజెఐపై దాడికి ఆవాజ్ ఖండన : సిజెఐ గవాయ్‌పై మతోన్మాదుల దాడిని ఆవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ఎస్ఎ.సుభాన్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎమ్‌డి.షరీఫ్ ఖండించారు. **పత్తికొండ** న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి టి.జ్యోత్స్న దేవికి వినతిపత్రం అందజేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వై.మధు బాబు, జనరల్ సెక్రటరీ భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్, కోశాధికారి సూరజన్ నబి, లైబ్రేరియన్, సెక్రటరీ నరసారావు పాల్గొన్నారు. **కర్నూలు హాస్పిటల్ :** సిజెఐ గవాయ్‌పై దాడి చేయడాన్ని బ్యామ్‌సెఫ్ వైద్య విభాగం నాయకులు డాక్టర్ కంచర్ల హరిప్రసాద్ ఖండించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కరుణాకర రావు, ఆర్.నరసింహుడు ఖండించారు.



'మతోన్మాదిని కఠినంగా శిక్షించాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సిజెఐ డాక్టర్ బిఆర్.గవాయ్‌పై దాడి చేసిన మతోన్మాదిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్సీ, ఎఐసిసి సభ్యులు ఎం.సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రీ బాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సి.బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్‌టియుసి సిటీ అధ్యక్షులు ఆర్.ప్రతాప్ పాల్గొన్నారు.

గుప్తనిధుల కలకలం

సిబెళగల్ : మండలంలోని యనగండ్ల, గుండ్రవుల రెవెన్యూ నాగిరెడ్డికి చెందిన పొలాల్లో మంగళవారం గుప్తనిధుల కలకలం చెలరేగింది. నాగిరెడ్డి పొలాన్ని ఖాజా అనే రైతుకు కౌలుకు ఇచ్చారు. అదే పొలంలో పురాతనమైన అమ్మవారి రాతి విగ్రహం ప్రతిమ ఉంది. సోమవారం అర్ధరాత్రి దాటాక కొందరు గుర్తుతెలియని దుండగులు పెకిలించి అక్కడ పూజలు చేసి భారీ లోతులో గుంత తవ్వి నిధులను ఎత్తుకెళ్లినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. బెళగల్ ఎస్ఐ పరమేష్ నాయక్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ శ్రీనివాస్ గౌడ్ అక్కడకు వెళ్లి పరిశీలించారు. మండలంలో తవ్వకాలు వరుసగా జరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - వెల్దుర్తి

పోషణ పారిశుద్ధ్యం పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం వెల్దుర్తిలోని ఏడవ అంగన్వాడి సెంటర్‌లో సూపర్వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలు ఆరోగ్యకరంగా ఉండాలంటే అన్నం తినక ముందు మరియు మలవిసర్జన అనంతరం చేతులను సబ్బుతో ఎలా శుభ్రంగా కడుక్కోవాలో ఆరు పద్ధతులను పిల్లలతో చేతులను కడిగించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

ప్రీతి బాయి కేసును సిబిఐకి అప్పగించాలి

- ప్రధానిని కలిసేందుకు అవకాశం కల్పించాలి
- ప్రీతి బాయి తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

సుగాలి ప్రీతి బాయి కేసును సిబిఐకి అప్పగించాలని ప్రీతి బాయి మతురాలి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్ అన్నారు. మంగళవారం నగరంలో ఓ హోటల్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ సుగాలి ప్రీతి బాయ్ మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని 8 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్న న్యాయం చేకూరడం లేదన్నారు. అధికారంలోకి రాకముందు ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన వద్దకు చిత్తు పేపర్లు తీసుకువచ్చిన స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సుగాలి ప్రీతి మృతి పట్ల గొంతు చించుకుని మాట్లాడిన ఆయన నేడు గొంతు మూగబోయిందన్నారు. అసెంబ్లీలో ఏ ఒక్కరు కనీసం స్పందించక పోవడం ఆశ్చర్యను కలిగిస్తుందన్నారు. అధికారం ఉండి కూడా చొరవ చూపక పోవడం తనను బాధించిందన్నారు. జాప్యాన్ని ప్రార్థించిన తనపై తన కార్యకర్తలతో ఎదురుదాడి చేయిస్తూ తన అవిటితనాన్ని పేదరికాన్ని ఎత్తి పొడుస్తూ కించపరిచే చర్యలకు పాల్పడ్డారన్నారు. ప్రభుత్వ చట్టం ఇచ్చిన హక్కుల మేరకే మాత్రమే నష్టపరిహారం చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వమిచ్చిన సదరు భూమి కూడా ప్రస్తుతం దాని విలువ సున్నాతో సమానంగా ఉందన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో ప్రధానమంత్రితో కలిసి సమస్యను విన్నవించుకునేందుకు అవకాశం కల్పించాలని వారు కోరారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్వతి, రాజు నాయక్

మోడీ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఈనెల 16న ప్రధాని నరేంద్ర మోడీ శ్రీశైలం, కర్నూలుకు రానున్న నేపథ్యంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం ఓర్వకల్లు మండలం నన్నూరు రాగమయూరిలో బహిరంగ సభ, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగసభకు కర్నూలు, నంద్యాల జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చే రూట్లను స్వయంగా పరిశీలించారు. జిల్లా పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధాని పర్యటనకు సంబంధించి భద్రతాపరమైన అంశాలను, ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రధానమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్టాత్మకమైందని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అధికారులు పూర్తి సమన్వయంతో, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. భద్రత ఏర్పాట్లలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో రాజకీయం సరికాదు

- మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి - పత్తికొండ


కూటమి ప్రభుత్వం రైతులకు కలుగుతున్న నష్టాల గురించి ఆలోచించాల్సింది పోయి నష్టపోయిన వారు ఏ రాజకీయ పార్టీకి చెందిన వారు అన్న విషయాలపై మాట్లాడడం సరైనది కాదని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఉల్లి, టమోటా రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లేకపోవడం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంట కోత కూలిలు కూడా పెట్టుకోలేని పరిస్థితిలో రైతులు పంటలను వదిలేస్తుంటే.. దానిపై రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపిపి నారాయణదాసు, వైసిపి రాష్ట్ర ఫోరం అధికార ప్రతినిధి శ్రీరంగడు, టిఎండి.హుస్సేన్, పత్తికొండ మాజీ సర్పంచి సోమశేఖర్, మండల కన్వీనర్ కారం నాగరాజు, కో ఆప్షన్ మెంబర్ నజీరు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణకు చట్టపరమైన చర్యలు

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వృద్ధులకు పిల్లల నుంచి ఎలాంటి సంరక్షణ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. మంగళవారం నగరంలోని ఎ.క్యాంపు ఉద్యాన భవన్ హార్టికల్చర్ శిక్షణ కేంద్రంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. లీలా వెంకట శేషాద్రి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వృద్ధుల సంక్షేమ శాఖ చైర్మన్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కర్నూలు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డిస్ట్రిక్ కోఆర్డినేటివ్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ జఫ్రుల్లా, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన ఐదుగురు వృద్ధులను సన్మానించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

ఆశాల సమస్యలు పరిష్కరించాలి
- యూనియన్ జిల్లా కార్యదర్శి శివలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు
ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి బి.శివలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ హెల్త్ సెంటర్‌లో నిరసన చేపట్టి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 20 ఏళ్ల నుంచి సర్వీసు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాల శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఆశాలు రంగలక్ష్మి, విశాలాక్ష్మి, అన్వేశ్వర, లింగమ్మ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఓపై విచారణకు ఆదేశాలు
- చక్రవర్తికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - హోళగుంద
హోళగుంద ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న చక్రవర్తిపై విచారణకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన 'డిప్యూటీ ఎంపిడిఒ ఇష్టారాజ్యం' వార్తకు డిపిఒ భాస్కర్ స్పందించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... మద్యం మత్తులో విధులకు హాజరవుతున్నట్లు వస్తున్న విమర్శలపై విచారణకు ఆదేశించారు. షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదోని డిఎల్‌పిఒ తిమక్కకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. విచారణలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరించడంతో పాటు, మద్యం తాగి కార్యాలయానికి వస్తున్నట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'వైద్యుల సమస్యలు పరిష్కరించాలి'


నిరసన తెలుపుతున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ప్రజాశక్తి - గోనెగండ్ల
వైద్యుల సమస్యలను పరిష్కరించాలని వైద్య, ఆరోగ్య సిబ్బంది డిమాండ్ చేసింది. కొద్ది రోజులుగా వైద్యులు రాష్ట్రవ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారు. మంగళవారం గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద భోజన విరామ సమయంలో సమ్మెకు మద్దతుగా నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి వైద్యుల సమస్యలపై దృష్టి సారించి వారి డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన ఈడిగ గురురాజ కుటుంబానికి టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం స్థానిక సంతమార్కెట్ వద్ద నివాసముంటున్న ఈడిగ హంపయ్య కుమారుడు గురురాజ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన గురురాజ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి.. తక్షణ సహాయం కింద రూ.5 వేలు అందజేశారు. విద్యాకమిటీ ఛైర్మన్ గనేకంటి గురురాజ, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, వార్డు సభ్యులు చిన్న భీమా, వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, సున్నం రఘు, రామకృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యోబు ఉన్నారు.

మైక్ సెట్‌కు రూ.20 వేల విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం



మండలంలోని చిలకలడోణ గ్రామ సమీపంలో ఉన్న కెజిబివిలో మైక్ సెట్ కొనుగోలు కోసం వైసిపి నాయకులు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి హామీని నిలబెట్టుకున్నారు. మంగళవారం వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, నాయకులు జనార్ధన్ రెడ్డి, వికెసి రఘు ఆధ్వర్యంలో పాఠశాల ప్రిన్సిపల్ శాంతికి నగదు అందజేశారు. గతంలో కెజిబివిని సందర్శించినప్పుడు పాఠశాలకు మైక్ సెట్ అవసరమని కోరారని, వారి కోరిక మేరకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు విరాళం అందించామని తెలిపారు.

కళ్లుగప్పి మాయ..!

- రాయితీ రైతులకా.. దళారులకా..?
- బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.6,100
- ప్రభుత్వం చెబుతున్నది రూ.7,800
- సబ్సిడీ ధర రూ.5,850

ప్రజాశక్తి - ఆలూరు


విత్తుకు సిద్ధం చేస్తున్న రైతులు

పప్పు శనగ సబ్సిడీ విత్తనాలను రైతులకు అందించడంలో ప్రభుత్వం, అధికారులు పట్టపగలే కళ్లుగప్పి రాయితీని మాయ చేస్తున్నారు. ప్రస్తుతం పప్పు శనగ బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.6 వేలు ఉంది. ప్రభుత్వం రూ.7,800లుగా నిర్ణయిస్తూ 25 శాతం సబ్సిడీతో క్వింటా రూ.5,850లకు రైతులకు అందించబోతోంది.

ప్రభుత్వ పెద్దలు, అధికారులు, దళారుల చేతివాటం రైతులకు శాపంగా మారింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటా పప్పు శనగ ధర రూ.6 వేలు ఉండగా ప్రభుత్వం మాత్రం రూ.7,800లుగా నిర్ణయిస్తూ 25 శాతం సబ్సిడీతో ఇస్తున్నామని కల్లబొల్లి మాటలతో రైతుల ప్రభుత్వమని రైతులను ఆదుకుంటామని చెబుతోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.6 వేలు ఉంటే సబ్సిడీతో రూ.5,850కు ఇస్తే రూ.150 మాత్రమే మిగులుతుంది. సబ్సిడీ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పడిగాపులు కాయాలి.

రూ.7,800 ధర ప్రభుత్వ దళారుల కోసమా..?
బహిరంగ మార్కెట్‌లో క్వింటా పప్పు శనగ రూ.6 వేలు ఉండగా అధికారులు ఎపి సీడ్స్ ద్వారా రూ.7,800 కొనడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు, ఎపి సీడ్స్ అధికారుల చేతివాటం వల్ల ప్రభుత్వ (ప్రజల) సొమ్మును అప్పనంగా దోచేసుకుంటున్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో రబీ సీజన్‌లో ప్రధానంగా పప్పు శనగ పంట సాగవుతోంది. ఆలూరు సబ్ డివిజన్‌లో గతేడాది 29,600 హెక్టార్లలో సాగు కాగా ఈ ఏడాది 21,675 హెక్టార్లలో పప్పు శనగ పంట సాగవుతోంది. ఆలూరు సబ్ డివిజన్‌కు జిల్లా వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి 25,162 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం 12,300 క్వింటాళ్లు మంజూరు చేసింది. మొదటి విడతగా 4,150 క్వింటాళ్లు, రెండో విడతగా 8,150 క్వింటాళ్లు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు.

రాయితీ ఏమాత్రం సరిపోదు
- రంగస్వామి, రైతు, ఆలూరు



ప్రభుత్వం అందిస్తున్న 25శాతం రాయతీ ఏమాత్రం సరిపోదు. బహిరంగ మార్కెట్‌లో రూ.6 వేలు ఉంటే ప్రభుత్వ రాయితీతో రూ.5,850కు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటే సరిపోదు. 50 శాతం రాయితీతో ఇస్తే రైతులను ఆదుకున్నట్లు.

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం
- పి.హనుమంతు, రైతుసంఘం జిల్లా నాయకులు



మార్కెట్ ధర క్వింటా రూ.6 వేలు ఉంటే ప్రభుత్వ ధర రూ.7,800 ఎలా నిర్ణయిస్తారు. అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారుల చేతివాటంతో రైతులను దగా చేస్తున్నారు. రైతులకు మార్కెట్ ధరలో 50 శాతం రాయితీ విత్తనాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలి.


బేతపల్లి రహదారి

రోడ్డు నిర్మాణానికి నిధులు
- గ్రామస్తుల హర్షం

ప్రజాశక్తి - దేవనకొండ
మండలంలోని పి.కోటకొండ గ్రామ బస్‌స్టేషన్ నుంచి లక్కసాగరం గ్రామం వరకు అధ్వానస్థితిలో ఉన్న రహదారి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.6.80 కోట్లు మంజూరు చేయడం పట్ల టిడిపి మండల ఉపాధ్యక్షులు మల్లేపల్లి రంగడు, టిడిపి నాయకులు దేవేంద్ర గౌడ్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత అనేక సంవత్సరాల నుంచి అధ్వానస్థితిలో ఉన్న ఆ రహదారి నిర్మాణానికి టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అతి త్వరలో భూమి పూజ చేసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆ రహదారి నిర్మాణం పూర్తయితే దాదాపు 10 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడం పట్ల టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నీ అంతు చూస్తా...
- మా సార్‌పై వార్త ఎలా రాస్తావ్..!
- విలేకరిని ఫోన్‌లో బెదిరించిన సర్పంచి తనయుడు
- వాస్తవాలు రాస్తే బెదిరింపులకు పాల్పడడం పిరికిపంద చర్య
- ఎపియుడబ్ల్యుజె మండల అధ్యక్షులు నాగరాజ్

ప్రజాశక్తి - హోళగుంద
'నీ అంతు చూస్తా. మా సార్‌పై ఎలా వార్త రాస్తావ్' అంటూ మండలంలోని ఓ గ్రామానికి చెందిన సర్పంచి తనయుడు విలేకరిపై బెదిరింపులకు పాల్పడినట్లు ఎపియుడబ్ల్యుజె మండల అధ్యక్షులు సిహెచ్.నాగరాజు, గౌరవాధ్యక్షులు బిఎం.అమీర్‌సాబ్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. హోళగుంద డిప్యూటీ ఎంపిడిఒ చక్రవర్తిపై 'చక్రవర్తి ఇష్టారాజ్యం' అని పత్రికల్లో వార్త రాసినట్లు తెలిపారు. ఓ గ్రామానికి చెందిన సర్పంచి తనయుడు ఫోన్ చేసి 'మా డిప్యూటీ ఎంపిడిఒపై, మా పంచాయితీ కార్యదర్శిపై వార్త ఎలా రాస్తావ్. నీ వల్ల మా సార్‌కు షోకాజ్ నోటీసు వచ్చింది. నీ కథ చూస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పారు. ప్రజలకు వాస్తవాలు చూపే జర్నలిస్టులకు ఫోన్ చేసి బెదిరించడం పద్ధతి కాదని, ఏదైనా సమస్యలుంటే చట్టపరంగా వెళ్లాలని సూచించారు. విలేకరులను బెదిరించడం, దాడులకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. బెదిరింపులకు పాల్పడిన సర్పంచి తనయునిపై చర్యల నిమిత్తం పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరోసారి పునరావృతమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సిజెఐపై దాడి హేయం : ఐలు

ప్రజాశక్తి- ఆలూరు
సిజెఐ డిఆర్.గవాయ్‌పై దాడి హేయమని ఐలు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు జె.వీరేష్, షాకీర్ తెలిపారు. మంగళవారం ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ముందు ఐలు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిజెఐపైనే దాడి జరిగితే సాధారణ ప్రజలకు ఏం రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐలు నాయకులు, న్యాయవాదులు ప్రసాద్, విజయ్ భాస్కర్, చాంద్ బాషా, ఈరన్న రావు, నరేష్, న్యాయవాదుల గుమస్తా శీనప్ప, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు గోవర్ధన్ పాల్గొన్నారు.


ఆలూరులో మాట్లాడుతున్న నాయకులు


ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో ఆందోళన

ఎమ్మిగనూరులోని సోమప్ప సర్కిల్‌లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కెవిపిఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పోగు తిమ్మన్న, కోటేకల్ చిన్నప్ప, వృత్తి చర్మకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆంథోని, కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు కలుగొట్ల రాజా రమేష్, పట్టణ అధ్యక్షులు గుంటెప్ప, సోగనూర్ రాముడు, దళిత సంఘం నాయకులు గుడికల్ స్వామి దాసు, కెవిపిఎస్ నాయకులు కలుగొట్ల రామలింగడు, గుడికల్ ఆనంద్, చర్మకారులు రాయప్ప, జె.బాబు, దావీదు, బాబు, కలుగొట్ల మారెప్ప పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సంత మార్కెట్‌లో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుడిసె మహానంది విలేకరులతో మాట్లాడారు. సిజెఐ గవాయ్‌పై ఓ మతోన్మాది దాడి చేయడం బాధాకరమన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టాక మతోన్మాదం రోజురోజుకు పెరిగి పోతోందని విమర్శించారు. వైసిపి నాయకులు తిప్పన్న, పరశురాముడు, వీరేష్, వెంకట రాముడు, సాయి, అజయ్, రంగనాయకులు, మహానంది పాల్గొన్నారు.

పంట నమోదుతోనే రాయితీలు
- పత్తిలో తేమ శాతం లేకుండా చూసుకోండి - జెడిఎ వరలక్ష్మి

ప్రజాశక్తి- దేవనకొండ
రైతులు పంట నమోదు చేయించుకున్నప్పుడే ప్రభుత్వ నుంచి అన్ని రాయితీలూ, ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం పొందగలుగుతారని జెడిఎ వరలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం దేవనకొండ క్రాస్ రోడ్డులోని ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో మారి సంస్థ ఆధ్వర్యంలో కోడుమూరు, దేవనకొండ మండలాల రైతులతో కలిసి అంతర్జాతీయ పత్తి దినోత్సవం నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. రైతులు పత్తి ఉత్పత్తులను మార్కెట్లకు అమ్మకానికి తీసుకెళ్లేటప్పుడు 8 శాతంలోపు తేమ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. నాణ్యమైన పత్తి, నాసిరకం పత్తి వేరు చేయాలన్నారు. లేకపోతే మంచి ధర లభించదని చెప్పారు. రైతులు రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలన్నారు. జిల్లా అభివృద్ధి మేనేజర్ సుబ్బారెడ్డి, కెవికె బనవాసి ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి, రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ కుమారస్వామి రెడ్డి, పత్తికొండ ఎడిఎ విజయమోహన్, వ్యవసాయ అధికారులు ఉషారాణి, సురేష్, అక్బర్ బాషా, నాగరాజు, మారి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీ, ప్రొడక్షన్ యూనిట్ మేనేజర్ ఇంతియాజ్ బాషా పాల్గొన్నారు.

అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : మండలంలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు ఉచ్చీరప్ప, జనసేన నాయకులు కటిక ఉచ్చీరప్ప, రామాంజనేయులు, సిపిఐ నాయకులు నరసారావు వినతి పత్రం ద్వారా కోరారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

ప్రయివేట్ ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని


అధికారికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆదోని ప్రయివేట్ (బస్సు) ట్రావెల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్రకు సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు గోపాల్, తిప్పన్న, వీరేష్ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని శ్రీనివాస ట్రావెల్స్ నిర్లక్ష్యంతో బస్సు బోల్తా పడి ప్రయాణికులకు గాయాలయ్యాయని తెలిపారు. బస్సు యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రయాణికులు మాత్రమే ప్రయాణించాల్సిన బస్సులో సరుకులు సరఫరా చేస్తున్నా ఆర్‌టిఒ అధికారులు, సేల్స్ ట్యాక్స్ అధికారులు అలసత్వం వహిస్తున్నారని విమర్శించారు. ప్రయాణికుల ప్రాణాల కన్నా సరుకుల రవాణా విషయంలోనే శ్రద్ధ తీసుకుంటూన్నారని తెలిపారు. సరుకుల ఎగుమతి, దిగుమతి చేస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా ఉంటున్నారని విమర్శించారు. శ్రీనివాస ట్రావెల్స్ యాజమాన్యం పట్టణం నడిబొడ్డున సరుకుల బుకింగ్ కేంద్రాన్ని ప్రారంభించినా అధికారులు ఆ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని మండిపడ్డారు. గతంలో బస్సు వెనుక భాగంలో టూ వీలర్ (స్కూటర్) లాంటివి లోడింగ్ చేసినా.. వాటిని ఆధారాలను సిపిఎం ఆధ్వర్యంలో అధికారులకు చూపించినా నామమాత్రపు రుసుంలు వేసి చేతులు దులుపుకున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్‌పై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


కర్ణాటక మద్యం స్వాధీనం


ప్రజాశక్తి - కోసిగి
అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న కౌతాళం మండలం కరణి గ్రామానికి చెందిన హరిజన హుస్సేనిని అదుపులో తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. మండలంలోని అగసనూరు నుంచి కందుకూరు వెళ్లే దారిలో దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో 480 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ సిబ్బంది కిషోర్ కుమార్, మునిరంగడు, భరత్, రవికుమార్, తిక్కయ్య పాల్గొన్నారు.


వాల్మీకి అందరివాడు...
- ఎమ్మెల్యే విరుపాక్షి
- ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-ఆలూరు
వాల్మీకి దేశానికే ఆదర్శమని, ఆయన అందరివాడని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి, ఎమ్మెల్సీ మధుసూదన్ తెలిపారు. మంగళవారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆలూరు పాతబస్టాండ్‌లోని, తేరుబజార్‌లో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. భాస్కర్ నాయుడు, మొలగవల్లి రామాంజినేయులు, ఎల్లప్ప, వెంకటేశులు, అరికేర వీరేష్, తిక్కస్వామి, అర్ధగేరి శీనప్ప, మల్లికార్జున, జె.వీరేష్ పాల్గొన్నారు. **హాలహర్వి**, నిట్రవట్టి గ్రామాల్లోని వాల్మీకి విగ్రహాలకు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పూజలు చేసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన విరుపాక్షి మాట్లాడారు. మానవతా విలువలను, ఉన్నతమైన అంశాలను రామాయణం అడుగడుగునా బోధిస్తుందని, అటువంటి గొప్ప కావ్యాన్ని రచించిన మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. **హోళగుంద** మండలంలో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. వైసిపి రాష్ట్ర మహిళా నాయకులు శశికళ, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తనయుడు చంద్రశేఖర్ మాట్లాడారు. వాల్మీకి మహర్షి అందరివాడని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని తెలిపారు. **కౌతాళం,** బదినెహాల్, కుమ్మల నూరు, కామవరం, ఉరుకుంద తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి నిర్వహించారు. రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరెక్టర్, టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, రామలింగ, సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు, మారెప్ప, పట్టణ అధ్యక్షులు రాజానందు, చౌదరి బసవరాజు, ముసలయ్య, గొట్టయ్య, గిరి, చంద్ర, సురేష్, మహా దేవ, నరసింహులు పాల్గొని పూజలు నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, సిద్ధు, రఘురాం, సోమన్న వాల్మీకికి పూజలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్, ఉప సర్పంచి తిక్కయ్య, వైసిపి నాయకులు రాముడు, అబ్దుల్ సమ్మద్, రామకృష్ణ వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. **మంత్రాలయం**లోని వాల్మీకి విగ్రహానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి, మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, నాయకులు జనార్ధన్ రెడ్డిలు పూజలు చేశారు. మంచాల సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి, ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మన్న పాల్గొన్నారు. వారికి వాల్మీకి మండల ఉపాధ్యక్షులు పి.రాఘవేంద్ర, ఎంపిటిసి వెంకటేష్, మంచాల సొసైటీ డైరెక్టర్ డిసి.తిమ్మప్ప, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు మేకల నరసింహ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. అలాగే మండలంలోని చెట్నెహళ్లి గ్రామంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఎపిబివిఎస్ మండల కార్యదర్శి, మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్, ఎంపిటిసి రామాంజి, ఎపిఎస్ యూత్ సభ్యులు రామాంజి, వెంకటేష్, దుబ్బన్న, తిక్కన్న, సురేష్, శీను పాల్గొన్నారు. **ఆస్పరి** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉమాదేవి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి ఎంపిడిఒ గీతావాణి, ఎంఇఒ రాజేంద్ర ప్రసాద్ పూలమాలలు వేసి పూజలు చేశారు. సొసైటీ కార్యాలయంలో సిఇఒ నరసింహులు, సచివాలయంలో సర్పంచి మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. బిణిగేరి, హాలిగేరా, చిరుమాన్ దొడ్డి గ్రామాల్లో వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి జయంతి నిర్వహించారు. టిడిపి మాజీ కన్వీనర్లు తిమ్మన్న, శ్రీనివాస్ గౌడ్, వైసిపి మండల మాజీ కన్వీనర్లు రామాంజినేయులు, రాఘవేంద్ర, పెద్దయ్య, జనసేన మండల కన్వీనర్ అరవింద్, సర్పంచి వెంకటేష్, ఎంపిటిసి రాధాకృష్ణ, నాయకులు యుగంధర్, రాజ్ కుమార్, సతీష్, శంకర్, నాగన్న, నాయుడు, మనోహర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, వీరేష్, నాగేంద్ర, మహానంది పాల్గొన్నారు. **ఆదోని** నియోజకవర్గంలో వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని వాల్మీకి నగర్ వాల్మీకి దేవాలయంలో విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి పూజలు చేశారు. వాల్మీకి చూపిన బాటలోనే పయనించాలని టిడిపి యువ నాయకులు సిద్ధార్థ నాయుడు, కౌన్సిలర్ పార్వతి కోరారు. మండలంలోని మధిర గ్రామంలో వాల్మీకి విగ్రహానికి టిడిపి సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి పూలమాలలు వేసి పూజలు చేశారు. నాయకులు సౌదీ రావుఫ్, టిడిపి మాజీ కౌన్సిలర్ రామచంద్ర, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, శ్రీనివాసులు, ఎన్‌బికె నాగరాజ్, మల్లేశ్వరప్ప, బిటి.శీన, తిక్కన్న పాల్గొన్నారు. నేటి తరానికి మహర్షి వాల్మీకి రచనలు దిక్సూచి అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. పట్టణంలోని కల్లుబాయి ప్రాంతంలో వాల్మీకి వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించారు. గుడిసె శ్రీరాములు, మాజీ ఎంపిపి మురళీ, కల్లుబావి మల్లికార్జున, సిపిఐ రాజు, సాధిక్ వలీ, భరత్, విజయ్ చిట్టి ఉన్నారు. **చిప్పగిరి**తో పాటు నేమకల్లు, డేగలపాడు, నగరడోన గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. డేగులపాడులో వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సొసైటీ మాజీ ఛైర్మన్ మల్లికార్జున, సర్పంచి నీలకంఠ ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేమకల్లులో వాల్మీకి యువత వాల్మీకి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. నగరడోనలో పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. **కోసిగి**లోని వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే వాల్మీకి విగ్రహానికి టిడిపి, వైసిపి నాయకులు పూలమాలలు వేశారు. వాల్మీకి కమిటీ సభ్యులు ముకుంద క్రిష్టప్ప, నాగరాజు, నారాయణ, వీరేష్, మాంతయ్య పాల్గొన్నారు.


ఆలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి


ఆదోనిలో...


హోళగుందలో


మంత్రాలయం


కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు


ఆస్పరిలో పూజలు చేస్తున్న నాయకులు, అధికారులు


చిప్పగిరి


హాలహర్విలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బాధిత రైతులకు నష్టపరిహారమివ్వాలి
- రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - కోసిగి
అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని రైతుసంఘం నాయకులు కోరారు. మంగళవారం రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులు పూజారి శ్రీనివాసులు, వీరేష్ మాట్లాడారు. మండలంలో పత్తి పంట దాదాపు 9 వేల హెక్టార్లలో సాగు చేశారని, వేరుశనగ, ఉల్లి తదితర పంటలు కూడా సాగు చేశారని తెలిపారు. పంటల సాగుకు ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారని చెప్పారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల పత్తి, వేరుశనగ, ఉల్లి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ పరశురామ్‌కు, ఎఐ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, నాయకులు వెంకటేష్, కెవిపిఎస్ నాయకులు హనుమంతు, వ్యకాస నాయ కులు కదలి వెంకటేష్, చిన్న మూకప్ప, కాలింగ, జక్కినిగేని ఈరన్న, చింతకుంట ఈరన్న, ఈరన్న, నాగేంద్ర, నరసప్ప, మహాదేవ, బొంపల్లి శెట్టి పాల్గొన్నారు.

జిఎస్‌టిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గోనెగండ్ల


కెజిబివిలో జిఎస్‌టి ఆకారంలో ఉన్న విద్యార్థినులు

సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ పథకం పై మండలంలోని 13 ఉన్నత పాఠశాలల్లో మంగళవారం అవగాహన కల్పించినట్లు ఎంఇఒ-2 నీలకంఠ తెలిపారు. జిఎస్‌టిలో సంస్కరణలతో నాలుగు స్లాబులుగా ఉన్న జిఎస్‌టిని రెండు స్లాబులుగా విభజించడం వల్ల సామాన్యులకు కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్‌తోపాటు సెమినార్లు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఎంపిడిఒ మణిమంజరి పాల్గొన్నారు.

'రీసర్వేతో సమస్యలు పరిష్కారం'

ప్రజాశక్తి - చిప్పగిరి
రీ సర్వే చేయడం వల్ల పొలం సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం నగరడోన గ్రామంలో రీసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో జిల్లాలోనే చిప్పగిరి రెండో స్థానంలో ఉందని తెలిపారు. దాదాపు 6,998 స్మార్ట్ కార్డులను పంపిణీ చేసినట్లు చెప్పారు. రేషన్ పంపిణీలో కూడా చిప్పగిరి మండలం మొదటి స్థానంలో ఉందన్నారు. రెవెన్యూ సిబ్బంది మంచి కృషి వల్లే మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల కోసం నమోదు చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



సబ్సిడీ పప్పు శనగ విత్తనాలు పొందాలనుకున్న రైతులందరూ దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ఆయన చిప్పగిరి రైతు సేవా కేంద్రంలో మాట్లాడారు. క్వింటా పప్పు శనగల ధర రూ.7,800 ఉండగా ప్రభుత్వం సబ్సిడీ ధర రూ.1,950 పోను రూ.5,850 రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మండలానికి మొదటి విడత కింద 2,500 క్వింటాలను ప్రభుత్వం అలాట్‌మెంట్ చేసిందన్నారు. ఖరీఫ్ పంటలను ఈకేవైసీ చేయించుకోవడానికి ఈనెల 25 వరకు గడువు పెంచిందని తెలిపారు. ప్రతి రైతూ ఈ సమాచారం తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎఇఒ రమాదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు రంగస్వామి, ప్రతాప్ నాయుడు, మనోహర్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-ఆలూరు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (స్కిల్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా ఈనెల 13 నుంచి ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. ఈ శిక్షణలో ఈనెల 13 నుంచి కొత్త బ్యాచికి శిక్షణ ప్రారంభమవుతుందని, మొత్తం 30 సీట్లు ఉన్నాయని చెప్పారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన యువత ఈ శిక్షణకు అర్హులని, ఆసక్తి కలిగిన యువత ఈనెల 8 నుంచి 10వ తేదీలోపు ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ వీరేష్ (90100 03132)ను సంప్రదించాలని తెలిపారు.